క్లుప్తంగా

ఈ - శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి

రాయచోటి అర్బన్ : అసంఘటిత రంగాల కార్మికులు వెంటనే ఈ - శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా కార్మికశాఖ ఇన్‌చార్జ్ అధికారి డి.వి.రంగరాజు కోరారు. ఆదివారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాల నమోదుతో జాతీయ ఆహార భద్రతా పథకం కింద ఆహార దినుసులు, ప్రమాదవశాత్తు మరణిస్తే, పూర్తి అంగవైకల్యం పొందితే రూ. 2లక్షల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. పీఎంఎస్‌వైఎం పథకం కింద పెన్షన్, ఇతర ప్రభుత్వ స్కీంల ఫలాలు పొందడానికి ఈ - శ్రమ్ పోర్టల్‌లో తప్పనిసరిగా వివరాలను నమోదు చేయాలన్నారు. వివరాలు నమోదు చేసుకున్న కార్మికులకు పోర్టల్ ద్వారా యూనివర్సల్ అకౌంట్ నంబర్ కేటాయింపబడుతుందన్నారు. అర్హులైన అసంఘటిత రంగ కార్మికులందరూ తమ వివరాలను తప్పక నమోదు చేసుకోవాలన్నారు.

నేడు మాంసపు దుకాణాలు మూసివేయాలి

నందలూరు (రాజంపేట) : అక్టోబర్ 2 (నేడు) సోమవారం గాంధీ జయంతి సందర్భంగా చికెన్, మటన్ దుకాణాలను మూసివేయాలని ఎస్‌ఐ అహ్మద్ జాకీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మాంసపు దుకాణాలు తెరవరాదని, హోటల్లోనూ మాంసపు విక్రయాలు జరపరాదని, మాంసపు దుకాణాల యజమానులకు తెలియజేశామన్నారు. ఎవరైనా మాంసాన్ని అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నల్లగంగమ్మకు బంగారు కాసుల దండ బహూకరణ



బంగారు కాసుల దండను అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె : శ్రీ దేవరరాయి నల్లగంగమ్మకు రాయచోటికి చెందిన విశ్రాంత కోర్ట్ ఉద్యోగి కాలా చెన్నకేశవులు, వారి కుమారుడు శివశంకర్ 20.3 గ్రాముల బంగారు కాసుల దండను బహూకరించారు. అర్చకులు దాతల కుటుంబ సభ్యులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి తీర్థ ప్రసాదాలు అందించి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం




తహసీల్దార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పుల్లంపేట : అన్నమయ్య జిల్లా రెవెన్యూ అధ్యక్షులు, పుల్లంపేట తహసీల్దార్ నరసింహ కుమార్ ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్ర రెవెన్యూ 17వ కౌన్సిల్ సమావేశంలో ఏఆర్ నరసింహకుమార్ రాసిన రెండు గేయాలు పాడినందుకు సీసీఎల్‌ఏ, ఏపీఆర్ఎస్‌ఏ సాయి ప్రసాద్, బొప్పరాజులు ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా పుల్లంపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

టీవీ టెక్నీషియన్‌ల సమావేశం

చిట్వేలి : స్థానిక అక్షర హైస్కూల్ వద్ద రాజంపేట, చిట్వేలిలకు చెందిన టీవీ టెక్నీషియన్స్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా లేటెస్ట్ టెక్నాలజీ అప్‌డేట్స్, యూనియన్ ఆవశ్యకత గురించి సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో రాజంపేట యూనియన్ ప్రెసిడెంట్ యూసుఫ్ అలీఖాన్, వైస్ ప్రెసిడెంట్ రాజ, సెక్రటరీ సుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరీ శివారెడ్డి, ఈశ్వరయ్య, లాల్ అహ్మద్, రాష్ట్ర ఏఈటీయూ జాయింట్ సెక్రటరీ హరికిషోర్, కడప జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సలీమ్ పాల్గొన్నారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి ఎన్నిక



ఖాజా హుస్సేన్

రామాపురం : మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా రామాపురం మండలం నీలకంఠ్రావుపేటకు చెందిన చెందిన షేక్ ఖాజా హుస్సేన్‌ను ఎంపిక చేశారు. విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ ముక్తి ఆయన్ను ఎన్నుకున్నట్టు ఆదివారం ఇక్కడికి విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేలా చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

సినీ చిత్రీకరణకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అనుకూలం

సిద్దవటం : సినిమాల చిత్రీకరణకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అనుకూలమని దర్శకుడు గాడి శివమణిరెడ్డి అన్నారు. స్థానిక సిద్దవటం కోటలో ఆదివారం రాత్రి చిత్రీకరణ జరుపుకుంటున్న కలియుగ పట్టణం షూటింగ్‌ను శివమణిరెడ్డి సందర్శించారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ రాఘవేంద్రవర్మ, పోలి రమేష్, రాజశేఖరరెడ్డిలు పాల్గొన్నారు.

పరిసరాలల పరిశుభ్రత .. అందరి బాధ్యత

- ఏక్ తారిక్.. ఏక్ గంటా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు, నాయకులు
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ పిలుపు



రాజంపేట రైల్వేస్టేషన్‌లో..



రాయచోటి అర్బన్: శ్రమదానం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు



ఓబులవారిపల్లె మండలంలో..



రామాపురం: కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

రాయచోటి అర్బన్ : తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని వీరభద్రాలయం సమీపంలోని జెడ్పీ ఉర్దూ పాఠశాల వీధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వీరభద్రాలయం కమిటీ చైర్మన్ పాలంరెడ్డి విజయ, కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలసి పాల్గొన్నారు. వీధిలోని చెత్తను శ్రీకాంత్‌రెడ్డి స్వయంగా వేరి చెత్తను ఎత్తి ట్రాక్టర్‌లో వేశారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతలో పట్టణాన్ని అందరికి ఆదర్శంగా నిలిచేలా సమష్టి కృషిని సల్పుదామని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హానికరంగా మారుతున్న ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలంటూ కోరారు.

రాయచోటి : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో స్వచ్ఛందంగా పాల్గొని పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆదివారం రాయచోటిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, చెన్నముక్కపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, రాజంపేటలోని మన్నూరు, బోయనపల్లి సరస్వతీ నగర్ ప్రాంతాలలో రాయచోటి, రాజంపేట భారతీయ స్టేట్ బ్యాంక్‌ల సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ శర్మ, చీఫ్ మేనేజర్ జగదీష్, ఎల్‌డీఎం వెంకటేశ్వరరెడ్డి, ఇతర ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్లు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నమండెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని ఆదర్శ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలోని పిచ్చిమొక్కలను తొలగించి చెత్తాచెదారాన్ని ఏరిపారేసి పరిశుభ్రం చేశారు. అనంతరం పాఠశాల నుండి ఎస్‌బీఐ కూడలి వరకు స్వచ్ఛతా హీ సేవా అనే నినాదంతో చీపుర్లు చేతపట్టి స్వచ్ఛత యొక్క పరమార్థాన్ని గ్రామస్తులకు ర్యాలీ ద్వారా తెలియజేశారు.

లక్కిరెడ్డిపల్లె : ప్రధాని నరేంద్రమోడీ స్వచ్ఛతా హీ సేవా స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఆదివారం అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లె మండలం కస్తూర్బా బాలికల పాఠశాలలో లక్కిరెడ్డిపల్లె బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామరాజు, బీజేపీ మేధావుల విభాగం సభ్యులు డాక్టర్ పాలగిరి శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాలగిరి శ్రీనివాసరాజు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోడి పిలుపు మేరకు స్వచ్ఛతాహీ సేవా.. స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేటు సంస్థాగత రంగాలకు చెందిన ప్రతి ఒక్కరూ ఒక గంటసేవ స్వచ్ఛందంగా వారి పరిసరాలను శుభ్రపరచడం జరిగిందన్నారు.

రామాపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని కుమ్మరపల్లి సర్పంచ్ ముక్కోటి భారతి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆదివారం స్వచ్ఛతా హీ సేవా ఏక్ తారీఖ్-ఏక్ గంటా కార్యక్రమంలో భాగంగా కుమ్మరపల్లి గ్రామ సచివాలయం ఆవరణంలో చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రతలో కుమ్మరపల్లి పంచాయతీ ఆదర్శంగా నిలిచేలా సమష్టి కృషి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కోటి బసిరెడ్డి, సచివాలయం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని రాయచోటి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హైదర్ అలీ అన్నారు. ఆదివారం కళాశాలలో పీఎం నరేంద్ర మోడీ పిలుపు మేరకు పరిశుభ్రతే ఆరోగ్య రక్ష అనే కార్యక్రమం నిర్వహణలో భాగంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పరిసరాలు - పరిశుభ్రత అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం. రామ్మోహన్‌రెడ్డి అధ్యాపక బృందం సి.సుగుణ, అక్బర్ బాషా, ఎ. అంజాద్ అలీఖాన్, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు శ్రమదానం చేద్దాం స్వచ్ఛ భారత్ సాదిద్దాం కార్యక్రమంలో భాగంగా బుజంగేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా హార్టికల్చర్ కన్వీనర్ తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ పరిసర ప్రాంతాలలో శ్రమదానం చేసి నీటి ట్యాంకులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, వెంకటరెడ్డి, దశరదరామయ్య, తొండం చంద్రశేఖర్, మల్లికార్జున, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు పట్టణంలోని పరిసరాలను ఆయా వీదుల్లో నివాసం ఉండే ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉప సర్పంచ్ తోట శివసాయి ఆదివారం పేర్కొన్నారు. రంగనాయకుల పేట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాస్కులు, క్లాత్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించి పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, సీహెచ్.రమేష్, పార్థసారధి, ఎంపీటీసీ రత్తయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, గుణవతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : పరిసరాల శుభ్రతను పాటించడమే స్వచ్ఛతా హీ సేవ లక్ష్యమని ఎంపీటీసీ వత్తలూరు రోహిణి కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొర్లకుంట పంచాయతీలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శ్రమదానం నిర్వహించి అంగన్‌వాడీ స్కూల్, ఎంపీపీ స్కూల్, రైతు భరోసా కేంద్రం దగ్గర శుభ్రం చేశారు.

పెనగలూరు : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు ఆదివారం ఈటమాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ రాజేశ్వరీ, శంకర్ రెడ్డిల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఈటమాపురం గ్రామ ప్రజలు ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలోని పరిసరాలను పరిశుభ్రం చేసి అనంతరం పాఠశాల, సచివాలయ పరిధిలో గంటపాటు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసుంధరమ్మ, విశాలాక్షి, విజయకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పుల్లంపేట : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా అంటువ్యాదులు ప్రబలవని మండల కన్వీనర్ ముస్తాక్ అన్నారు. నేడు గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదేశానుసారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం అప్పారాజుపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్, ఈఓపీఆర్‌డీ ప్రకాశంల ఆధ్వర్యంలో రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. అప్పయ్య రాజుపేట రైల్వేగేటు నుంచి సచివాలయం వరకు చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, రిజ్వాన్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : మండల పరిధిలోని చెర్లోపల్లి పంచాయతీ కేంద్రంలో ఆదివారం శ్రమదానంతో పరిసరాలను పరిశుభ్రం చేశారు. సర్పంచ్ ఓబినేని ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పిల్లలు, యువకులు, మహిళలు కలిసి ప్రాథమిక పాఠశాల అంగన్‌వాడీ కేంద్రం, శ్రీ పరదేశీ స్వామిగుడి తదితర పరిసరాలను శుభ్రం చేశారు.

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్టేషన్ మేనేజరు వెంకటసుబ్బయ్య నేతృత్వంలో రైల్వేస్టేషన్‌లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, కార్మికులు స్టేషన్ పరిసర సమీప ప్రాంతాల్లో సమ్మైకంగా చెత్తా చెదారాలను ఎత్తివేశారు. కమర్షియల్, ట్రాక్స్, ఇంజనీరింగ్, ట్రాఫిక్‌కు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

నందలూరు (రాజంపేట) : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ సూర్యనారాయణ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, ఆర్ అండ్‌బీ డివైడర్ వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ నందు మానవహారం నిర్వహించారు. నందలూరు సర్పంచ్ మోడపోతుల సుభాషిణి, ఎంపీటీసీ సుభాన్, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



పెనగలూరు మండల కేంద్రంలో...



లక్కిరెడ్డిపల్లె: పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు



రైల్వేకోడూరు అర్బన్: శ్రమదానంలో బీజేపీ నాయకులు



పుల్లంపేట: స్వచ్ఛతా హీ సేవాలో నాయకులు



రాయచోటి: పాల్గొన్న బ్యాంక్ అధికారులు, సిబ్బంది

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

– ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు: సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఓబనపల్లి అరుంధతివాడ గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం స్పందించిన ఆయన గ్రామంలో సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా పరంగా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజల అభివృద్ధికి సంక్షేమానికి తాము కట్టుబడి పనిచేస్తున్నామని, ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రతి మండలంలోని ప్రతి పంచాయతీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి చూపించామన్నారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమ విధానంతో ప్రజలందరికి మేలు జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, కనుపర్తి ఈశ్వరయ్య, మణి, నగిరిపాటి వినోద్, భాస్కర్, మురళి, జయశంకర్, నరేంద్ర, కిషోర్ పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

పెనగలూరు : ఇటీవల నారాయణ నెల్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన, మరణించిన వారి కుటుంబాలకు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తమ సొంత నిధులు ద్వారా ఆర్థికసాయం చేశారు. బిఎల్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆయా కుటుంబాలను పరామర్శించి వారిని అన్ని విధాల ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

‘టూవీలర్ మెకానిక్‌లకు కుల, మతాలు లేవు’



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దాయినేని ధర్మ

రాజంపేట రూరల్ : నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరికి నిత్యకృత్యమైన టూవీలర్‌లను రిపేర్ చేసే మెకానిక్‌లు వైద్యులతో సమానమని ఏపీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయినేని ధర్మ కొనియాడారు. స్థానిక బీఎస్ నగర్ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ సమీపంలో ఆదివారం రాజంపేట టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోషియేషన్ నూతన కార్యలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అసోషియేషన్ ప్రతినిధులు అట్టహాసంగా చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దాయినేనిదర్మ, వ్యవస్థాపక అధ్యక్షుడు ఆసీఫ్‌అలీఖాన్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డిలు రాజంపేట అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న టూ వీలర్ మెకానిక్‌లకు కుల, మతాలు లేవని తెలియజేశారు. ప్రతి ఒక్కరికి అవసరమైన మెకానిక్‌లు అందరికి సమానమేనని తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

జగన్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు



సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : చంద్రబాబునాయుడు, దత్తపుత్రుడు పవన్ ఎంతమంది కలిసి వచ్చినా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి విజయాన్ని అడ్డుకోలేరని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొర్లకుంటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడును సాక్ష్యాధారాలతో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఐడీ అధికారులు అరెస్టు చేశారన్నారు. ప్రభుత్వం ఎక్కడా కక్షపూరితంగా వ్యవహరించలేదని స్పష్టం చేశారు. చట్టం ముందు తప్పుచేసిన వారు ఎంతటివారైనా శిక్ష అనుభవించక తప్పదన్నారు. రాజమండ్రి జైలులో ములకాత్ పేరుతో చంద్రబాబుని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కలిసి ప్యాకేజ్ కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాజకీయాలలో కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలువలేని పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుదామని వారాహి యాత్రను చేపట్టడం హాస్యాస్పదమన్నారు. దీంతో రాష్ట్రంలోని యువతను రెచ్చగొట్టి తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరిగే అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజలను రెచ్చగొడుతున్నారని, ఈ విషయాలన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. నిలకడ లేని రాజకీయాలతో ఎన్నికల సమయంలో టిడిపి చంద్రబాబు నాయుడు కోసమే ప్రజల్లోకి వచ్చి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు చూడకుండా, వర్గాలు చూడకుండా రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని తెలియజేశారు. ఎంతమంది కలిసినా వచ్చే ఎన్నికలలో జగన్ విజయాన్ని అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

గాలివీడు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పెద్దూరులో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను పొందాలన్నారు.

స్టార్ లైనర్ బస్సులను నడపాలి

రాయచోటి అర్బన్ : రాయచోటి నుంచి విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం నగరాలకు ఆర్‌టీసీ అధికారులు స్టార్ లైనర్ బస్సులను నడపాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యుడు వై.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. రాయచోటి నుంచి సుదూర పట్టణాలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత ఆర్‌టీసీపై ఉందన్నారు. పండుగలు, సెలవురోజుల్లో బస్సుచార్జీలను పెంచి నిలువు దోపిడి చేస్తున్న ప్రైవేటు బస్సుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు చెక్కులు అందజేత



కార్మిక కుటుంబాలకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులుగా విధులను నిర్వరిస్తూ మరణించిన వారి కుటుంబాలకు పరిహారపు చెక్కులను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఆర్.మమత, నాగేశ్వరి, వేముల నాగరత్న కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రెండు లక్షల చొప్పున పరిహారం మెగా చెక్కును ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు అందించారు. బాధిత కుటుంబాలకు త్వరితగతిన పరిహారం అందించేలా కృషి చేసిన మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కమిషనర్ గంగాప్రసాద్, ఆర్ఐ మల్లికార్జునలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఆర్ఐ మల్లికార్జున కౌన్సిలర్లు ఆసిఫ్ అలీఖాన్, చాన్ బాషా, మదనమోహన్‌రెడ్డి, గౌస్‌ఖాన్, అల్తాఫ్, నరసింహారెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్, జయన్ననాయక్, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఫయాజ్ అహమ్మద్, భాస్కర్, జానం రవీంద్రయాదవ్, గువ్వల బుజ్జిబాబు, రత్నశేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

వీరభద్రుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం ఆయన ఆలయానికి రాగానే ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులతో కలసి ఆలయంలో అల్పాహారాన్ని స్వీకరించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.


ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు



సిద్దవటం: పూజలందుకున్న, ఇరుగులమ్మ

సిద్దవటం : మండలంలోని సిద్దవటం గ్రామ శివారులో మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీ ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సంబేపల్లె : దేవరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అర్చకులు అందించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



క్రీడా స్ఫూర్తితో మెలగాలి

నందలూరు (రాజంపేట) : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలుగుతూ గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సీనియర్ రైల్వే చీఫ్ మెడికల్ ఆఫీసర్ జయభాస్కరరావు, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్‌లు పేర్కొన్నారు. శనివారం రాత్రి నందలూరులోని సౌత్ సెంట్రల్ రైల్వే సంగ్ కార్యాలయంలో షంషేర్ షటిల్ బ్యాడ్మింటన్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు జిల్లాల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. దాదాపు 36 జట్లు టోర్నమెంట్‌కు హాజరయ్యాయి. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

